## ప్రజల భద్రతతోనే అసలైన పండుగ: కేశవపట్నం పోలీసులు




**రాజముద్ర న్యూస్, శంకరపట్నం:** ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని కేశవపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలందరికీ ఎస్సై శేఖర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పండుగ ఆనందంతో పాటు భద్రత కూడా ముఖ్యమని పేర్కొన్నారు. ముఖ్యంగా వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని, అతివేగం ప్రమాదకరమని హెచ్చరించారు. అలాగే ప్రస్తుత కాలంలో పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని, ఆన్‌లైన్ మోసాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏదైనా అత్యవసర పరిస్థితిలో వెంటనే పోలీసులను సంప్రదించాలని కోరారు.

## ముత్తారం గ్రామంఅక్రమ ఇసుక రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్ట్: కేశవపట్నం ఎస్సై




**రాజముద్ర న్యూస్, శంకరపట్నం:** మండల పరిధిలోని చల్లూరు గ్రామానికి చెందిన ఒక వ్యక్తి అక్రమంగా ఇసుక రవాణా చేస్తూ పోలీసులకు చిక్కాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వీణవంక మండలం చల్లూరు గ్రామానికి చెందిన అలకుంట్ల వెంకటేష్ అనే వ్యక్తి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను రవాణా చేస్తున్నాడు. గురువారం ముత్తారం గ్రామ శివారులో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా, ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వెంకటేష్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నందుకు అతనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు కేశవపట్నం ఎస్సై శేఖర్ రెడ్డి తెలిపారు. నిబంధనలు అతిక్రమించి ఎవరైనా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

## ఉగాది సందర్భంగా పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించిన గ్రామస్తులు..



**రాజముద్ర న్యూస్,శంకరపట్నం:** ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని కేశవపట్నం గ్రామంలో పోచమ్మ తల్లి ఆలయంలో గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. ఉదయం నుంచే మహిళలు సంప్రదాయ వేషధారణలో బోనాలు తీసుకుని ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తమ మొక్కలు చెల్లించుకుని కుటుంబ సభ్యుల శ్రేయస్సు, గ్రామాభివృద్ధి కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయి పండుగ వాతావరణం నెలకొంది. పూజా కార్యక్రమాలలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు భారీగా పాల్గొన్నారు. ఉగాది పర్వదినం సందర్భంగా పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించడం ఆనవాయితీగా కొనసాగుతోందని గ్రామస్తులు తెలిపారు.

## నేడు జైపూర్ మండలంలో విద్యుత్ నిలిపివేత

**ఉదయం 9 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు అంతరాయం**

**రాజముద్ర న్యూస్, మంచిర్యాల (జైపూర్):** జైపూర్ మండల పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు ముఖ్య గమనిక. 33కేవీ విద్యుత్ లైన్ల అత్యవసర మరమ్మత్తు పనుల కారణంగా రేపు (శుక్రవారం, మార్చి 20న) మండలంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. జైపూర్ విద్యుత్ సెక్షన్ ఏఈ తెలిపిన వివరాల ప్రకారం.. కుందారం పౌనూర్ సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 09:00 గంటల నుండి మధ్యాహ్నం 01:00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుంది. మరమ్మత్తు పనులు పూర్తయిన వెంటనే సరఫరా పునరుద్ధరించబడుతుందని, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి అధికారులకు సహకరించాలని కోరారు.

## ఎల్‌ఏ చిట్ ఫండ్స్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం




**కూకట్ పల్లి, రాజముద్ర న్యూస్:** వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాన్ని ప్రారంభించడం అభినందనీయమని తెలంగాణ సీనియర్ సిటిజన్స్ ఫోరమ్ అధ్యక్షుడు రాంచందర్ పేర్కొన్నారు. మండల కేంద్రమైన బాలానగర్ పరధిలోని వినాయకనగర్ ఎల్‌ఏ చిట్ ఫండ్స్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసినా చలివెంద్రాన్ని గురువారం అయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాంచందర్ మాట్లాడుతూ.. మానవ సేవయే మాధవ సేవ అని భావించి ఎల్‌ఏ చిట్ ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం చలివేంద్రాన్ని నిర్వహించడం సంతోషకరమైన విషయమన్నారు. వినాయకనగర్ ప్రధాన రహదారిపై ఉన్న చలివేంద్రం వల్ల ప్రయాణీకులు, బాటసారుల దాహార్తిని మండు వేసవిలో తీర్చడమనే సేవా కార్యక్రమం చేపట్టడం మహోన్నతమైన విషయమని కొనియాడారు. ఇలాంటి సేవాకార్యక్రమాలను మరిన్ని చేయడానికి పులి శివ కుమార్ గౌడ్ మిత్రమండలి ముందుకు రావాలని అయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దశ్రాథ్ గౌడ్, రవి ముదిరాజ్, వెంకటేష్ గౌడ్, సదా గౌడ్, పులి శ్రీకాంత్ గౌడ్, పద్మావతి, దాండు రవి గౌడ్, కుమార్, శ్యామ్, రాజేందర్, రాము, విగ్నేష్ ఇతరులు పాల్గొన్నారు.

## కొండాపూర్ లో సేవా కార్యక్రమం నిర్వహణ

**లక్ష్మయ్య సాగర్ ప్రథమ వర్ధంతి సందర్భంగా నిత్యవసర వస్తువుల పంపిణీ**





**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్:** కొండాపూర్ శ్రీరామ్ నగర్ కాలనీ మాజీ అధ్యక్షులు లక్ష్మయ్య సాగర్ ప్రథమ వర్ధంతి సందర్భంగా నిత్యావసర వస్తువుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పేద అవసరమైన కుటుంబాలకు బియ్యం, కిరాణా సరుకులు వంటి నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. స్థానిక ప్రజలు, నాయకులు యువత పెద్ద సంఖ్యలో పాల్గొని లక్షయ్య సాగర్ సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు డిండి. రవి సాగర్ మాట్లాడుతు.. లక్షయ్య సాగర్ సమాజ సేవలో చేసిన కృషి మరువలేనిదని, శ్రీరామ్ నగర్ కాలనీలో ప్రెసిడెంట్ గా బాధ్యతలు నిర్వహించినప్పుడు కాలనీ వాసుల సమస్యలను, ముఖ్యంగా పుట్టగొడు గుల వచ్చిన హాస్టల్స్ ను కట్టడి చేయాలని ఈ హాస్టల్స్ వల్ల మిగతా రెసిడెన్షియల్ ఇంటి ఓనర్లకు ఇబ్బంది అవుతుందని, హాస్టల్స్ ని కట్టడి చేయాలని కార్పొరేటర్ దృష్టికి, జిహెచ్ఎంసి లో పలుమార్లు కంప్లీట్ కూడా ఇచ్చారు. కాలనీవాసులు అందర్నీ కలుపు కొని ధర్నాలు కూడా చేసి అరికట్టే ప్రయత్నం చేశారు. లక్ష్మయ్య సాగర్ ఆశ యాలను ముందుకు తీసుకెళ్లడం తమ బాధ్యతగా భావిస్తున్నామని డిండి. రవి సాగర్ తెలిపారు.

## మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: మంత్రి వివేక్ వెంకటస్వామి






- ఇందారంలో రంజాన్ తోఫా పంపిణీ.. ఇఫ్తార్ విందులో పాల్గొన్న మంత్రి
- జైపూర్ మండలానికి 350 తోఫా కిట్లు కేటాయింపు
- మసీదు వద్ద నూతన వాటర్ షెడ్ ప్రారంభం...

**రాజముద్ర న్యూస్ - మంచిర్యాల:** రంజాన్ పవిత్ర మాసాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదరులందరూ సుఖసంతోషాలతో పండుగ జరుపుకోవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర కార్మిక, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. గురువారం జైపూర్ మండలం ఇందారం గ్రామంలోని మసీదులో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు, తోఫా పంపిణీ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, ఎంపీఓ శ్రీపతి బాబురావులతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వం రంజాన్ కానుకగా ఇఫ్తార్ విందుతో పాటు 'ఈద్ ముబారక్' తోఫా కిట్లను అందజేస్తోందని తెలిపారు. జైపూర్ మండలానికి 350 కిట్లు మంజూరు కాగా, అందులో ఇందారం గ్రామానికి 250 కేటాయించినట్లు వివరించారు. నిరుద్యోగ యువత కోసం ప్రతి నియోజకవర్గంలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా వృత్తి విద్యా శిక్షణ ఇచ్చి, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. 99 రోజుల 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగంగా పారిశుధ్యం, తాగునీరు, పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్‌పై ప్రత్యేక దృష్టి సారించామని పేర్కొన్నారు. అనంతరం మసీదు సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ షెడ్ ను ప్రారంభించారు.

**క్యాతనపల్లిలో ఇఫ్తార్ విందు..**

అనంతరం క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఏ–జోన్ లో గల బిలాల్ మసీదుకు చేరుకున్న మంత్రి, అక్కడ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ వారితో కలిసి విందు స్వీకరించారు. ఈ కార్యక్రమాల్లో మైనారిటీ సంక్షేమ శాఖ అధికారులు, ముస్లిం మత పెద్దలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## గ్రామంలో ఘనంగా ఉగాది పంచాంగ శ్రవణం





ముత్తారంలో..



శంకరపట్నం మండలం గద్దపాక గ్రామంలో

- అభయ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు
- కొత్త ఏడాది ఫలితాలను వివరించిన సిద్ధాంతులు

**రాజముద్ర న్యూస్, శంకరపట్నం:** మండల పరిధిలోని కన్నాపూర్ గ్రామంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక అభయ ఆంజనేయస్వామి దేవాలయంలో పండితులు కలకుంట్ల మధుసూదన చార్యులు, మురళీ కృష్ణమాచార్యులు సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి, పరాభవ నామ సంవత్సర పంచాంగాన్ని ప్రజలకు వినిపించారు.ఈ సందర్భంగా పండితులు కొత్త సంవత్సరంలో వర్షపాతం, వ్యవసాయ దిగుబడులు, వ్యాపార, విద్యా రంగాల్లో ఉండబోయే మార్పులను వివరించారు. రాశి ఫలాలను తెలుసుకునేందుకు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నూనె రమా శ్రీనివాస్, ఉప సర్పంచ్ నూనె అశోక్, మాజీ సర్పంచ్ కాటం వెంకటరమణారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఎల్లారెడ్డి, భాగ్యలక్ష్మి ,వంగల నారాయణరెడ్డి, ఆలయ సేవకుడు పంజాల వెంకటయ్య, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ఉగాది వేడుకలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

